అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

- పంటను కాపాడుకునేందుకు పాట్లు
- వాన దెబ్బకు పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి: అకాల వర్షం అన్నదాతకు తీరని కష్టాన్ని తెచ్చింది. పాలకొల్లు నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు మండలాల్లో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో పెద్ద పెద్ద చెట్లు విరిగిపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వరికోత యంత్రంతో కోసిన ధాన్యం కల్లాల్లో ఉండుటతో రైతులు బరకాలు కప్పి అతి కష్టంగా ధాన్యాన్ని రక్షించుకున్నారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నానికి వర్షం తగ్గి ఎండ కాయడంతో రైతులు కూలీల సహాయంతో బరకాలపై నిలిచిపోయిన నీటిని చీపురు, డబ్బాల సహాయంతో బయటకు పారించి, అనంతరం ఎండబెట్టారు. మధ్యాహ్నానికి వర్షం తగ్గడంతో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి గ్రామాల్లో పర్యటించారు. ధాన్యపు రాశులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో 2200 మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులపై ఉందని, రైతులు ముందుగా జాగ్రత్త పడడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదని ఏఓ దేవి చెప్పారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆదివారం ఉదయం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి దుమారంతో ప్రధాన రహదారుల్లో చెట్లు కూలి కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సుమారు మూడు గంటల పాటు వర్షం పడటంతో ధాన్యం మాసూళ్లకు అంతరాయం కలిగింది. అనేక చోట్ల రైతులు ధాన్యం రోడ్లపై ఉండటంతో రాశుల్లో నీళ్ల ప్రవేశించింది. అనేక రోడ్లు జలమయమయ్యాయి. చాలాచోట్ల పంటపొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై తెచ్చుకోవడానికి ఆటంకం ఏర్పడింది.


పాలకొల్లు సెంట్రల్: పెద్ద పోస్టాఫీస్ వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

పెనుగొండ మండలంలో..

పెనుగొండ: అకాల వర్షంతో రైతన్నలు నిండా మునిగిపోయారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురవవడంతో రైతులు నానావస్థలకు గురయ్యారు. సంచుల కొరత, వాహనాల ఇబ్బందులతో చేతికందిన పంట రైసుమిల్లులకు చేరలేదు. దీంతో సుమారు మూడు గంటల పాటు పెనుగొండ, ఆచంట మండలాల్లో ఏకదాటిగా వర్షం కురవడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. అయితే భారీగా కురిసిన వర్షంతో కోతలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. చేలల్లోకి వరి కోత యంత్రాలు దిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో ఆదివారం వేకువ జామునే సంభవించిన పెనుగాలి గాలితో కూడిన భారీ వర్షానికి తీరప్రాంత గ్రామాలైన నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు గ్రామాలను కుదిపేసింది. ఒక్కసారిగా గాలి సుడులుతిరుగుతూ రావడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ఈదురు గాలుల కారణంగా పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. మామిడి పండ్లన్నీ నేలరాలాయి. వివిధ దశల్లో ఉన్న వరి ధాన్యం తడిచి పోయింది. తీరంలోని వేములదీవి, పియం లంక, చినమైనవానిలంక గ్రామాల్లోని ఉప్పు మడులన్నీ చెరువులను తలపించాయి. మండలంలోని సీతారాంపురం, రుస్తుంబాద, దర్బరేవు, కొప్పర్రు, లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టివారిపాలెం తదితర గ్రామాల్లో చెట్లు విరిగి పడ్డాయి. రహదారిలో చెట్లు అడ్డుగా పడి ఉండటంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించి, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొప్పర్రు, కొత్తనవరసపురం గ్రామంల్లో సుమారు 7 విద్యుత్ స్తంబాలు కూలిపోయాయి. విద్యుత్ శాఖ సిబ్బంది సంబంధిత సమస్యలను పరిష్కరించి రాత్రికి గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం పాతపాడులో రహదారిపై విరిగి పడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం


నరసాపురం రూరల్: కొప్పర్రు-మల్లవరం రహదారిలో కాలువలోకి పడిపోయిన వృక్షం

నరసాపురంలో దంచి కొట్టిన వాన

నరసాపురం: మండు వేసవిలో ఉక్కబోతతో అల్లాడిన ప్రజలు ఆదివారం వాతావరణ మార్పుతో ఊపిరిపీల్చుకున్నారు.ఉదయం 8 గంటలు నుంచి భారీ ఈదురుగాలుతో వర్షం పడింది. అనుకోని ఈ పరిణామంతో నరసాపురంలో జనజీవనం అతలాకులమైంది. ఆదివారంపూట మార్కెట్‌కు వచ్చిన ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పిడుగులు, గాలులతో పట్టనంలో అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చెట్లు, హోర్డింగ్స్ గాగికి పడటంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణకు 30 గంటలు సమయం పడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఇక ఉదయం నుంచి భారీ వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.


గాలులకు పట్టణంలో శివాలయం సెంటర్ వద్ద రోడ్డుపై పడ్డ హోర్డింగ్


5వవార్డులో వర్షపునీటికి కాలనీలో రోడ్డు మునిగిపోయిన దృశ్యం


పెనుమంట్ర: తడిసి ముద్దయిన ధాన్యం రాశులు


నరసాపురం రూరల్: కె.బేతపూడి గ్రామంలో వరిచేలోనే తడిసి ముద్దయిన పనలు


పెనుగొండ: సిద్ధాంతంలో హడావిడిగా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకొంటున్న రైతన్నలు


నరసాపురం రూరల్: వర్షానికి చెరువులను తలపిస్తున్న ఉప్పు మడులు

క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘ ఎన్నికల్లో లోకల్ అభ్యర్థికే పట్టం


ప్రవీణ్ భానును అభినందిస్తున్న సంఘస్తులు

యలమంచిలి: క్షీరపురి ఆర్యవైశ్యులు లోకల్ అభ్యర్థికే పట్టం కట్టారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో లోకల్, నాన్ లోకల్ అంటూ వాడీవేడిగా సాగిన ఆర్య వైశ్యుల సంఘం అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. లోకల్ అభ్యర్థి అయిన రేపాక ప్రవీణ్ భాను 405 ఓట్ల మెజారిటీతో ఈ ఎన్నికల్లో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు నాళం బాపిరాజు, కారుమూరి శ్రీరాములు ప్రకటించారు. పోటీ అయిపోయిందని, ఇక నుంచి సంఘస్తులంతా ఒక్కటేనని, అందరినీ కలుపుకొని సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రవీణ్ భాను ప్రకటించారు.

పసలదీవి దుర్గమ్మ జాతర ప్రారంభం


ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని పసలదీవి గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రధాన రహదారిలోని దుర్గమ్మ, మారమ్మ, అమ్మవార్ల ఆలయాల నుంచి చలిమిడి పానకాలను తీసుకు వెళ్లారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సోమవారం మధ్యాహ్నం 1 గంటకు అమ్మవారి నిప్పుల గుండాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం తీన్‌మార్, డప్పుల నృత్యం, బుట్టబొమ్మలతో జాతర మహోత్సవం ఉంటుందన్నారు.

శ్రీ కామాక్షమ్మకు రజిత కవచం అలంకరణ


మార్టేరులోని శ్రీ కామాక్షమ్మకు చండీ హోమం, శాంతి కల్యాణోత్సవ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని శ్రీ కామాక్షమ్మ వారికి దాతల సహకారంతో చేయించిన రూ 6.50 లక్షలు విలువైన నూతన రజత కవచాన్ని ఆదివారం అలంకరించారు. మార్టేరు పంచ గ్రామం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి వంశీకృష్ణ వేద పండితులతో ఆలయ ఆవరణలో సంప్రోక్షణ, చండీహోమం, శాంతి కల్యాణం మహోత్సవాలను నిర్వహించారు. 50 మంది భక్తులు దంపతులు సహితంగా చండీ హోమంలో పాల్గొని శాంతి కల్యాణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పరిసర గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

పాలకొల్లులో దాసరి జయంతి వేడుకలు


దాసరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి రామానాయుడు

యలమంచిలి: దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు జయంతి వేడుకలు ఆదివారం ఆయన స్వస్థలం పాలకొల్లులో ఘనంగా నిర్వహించారు. దాసరి నారాయణరావు కాంస్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో దాసరి కాంస్య విగ్రహానికి మంత్రి నిమ్మల రామానాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాసరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నం, బోనం చినబాబు, జక్కంపూడి కుమార్, చుండూరి శ్రీరంగ నాయుడు, కానూరి ప్రభాకర్, జి బాబు, పెచ్చెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి మంచినీటి సరఫరా తదితర అత్యవసర అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కడియపులంక నర్సరీలతో రాష్ట్రానికి కీర్తి

యలమంచిలి: దేశంలో రాష్ట్ర కీర్తిని ఘనంగా చాటుతున్న ఘనత కడియపులంక నర్సరీ రైతులదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు ఆదివారం నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్టిక్ 316 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని కడియపులంక నర్సరీలకు దేశ విదేశాలలో అత్యంత ప్రాముఖ్యత వస్తుందంటే అందులో రైతుల కృషి ఎంతో ఉందన్నారు. సందర్భంగా మంత్రి రామానాయుడుకి శ్రీ సత్యదేవా నర్సరీ అధినేత, మాజీ ఐఎన్‌ఏ ప్రధాన కార్యదర్శి పుల్లా వీర వెంకట్రావు నర్సరీ రైతులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా సంఘ సత్యనారాయణ, పుల్లా వీర్రాజు, పుల్లా రాజశేఖర్ ,నక్క అమ్మిరాజు, కర్రే ఎప్సై, పుల్లా శ్రీకాంత్, పేమ్మనబోయిన పెదకాపు, కొండేపూడి నాగు, వజ్రపు కోటేశ్వరరావు (లయన్స్ గవర్నర్) తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నిమ్మల రామానాయుడిని సత్కరిస్తున్న పుల్లా వీర వెంకట్రావు

గ్రామాల్లో అధికారుల పర్యటన

నరసాపురం రూరల్: అకాల వర్షం వల్ల రైతుల ఇబ్బందుల నేపథ్యంలో కొప్పర్రు, కె.బేతపూడి గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ధాన్యాన్ని వ్యవసాయశాఖ ఏడీ అనిల్‌కుమారి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం మండలంలో 6,450 మెట్రిక్ టన్నుల ధాన్యం, మొగల్తూరులో 1,950 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆదివారం నాటికి కల్లాల్లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఇంకా నరసాపురం మండలంలో సుమారు 3,800 ఎకరాలు, మొగల్తూరు మండలంలో 500 ఎకరాల్లో ఇంకా వరి కోతలు కోయాల్సి ఉందన్నారు. తహసీల్దార్ అయితం సత్యనారాయణ మాట్లాడుతూ లిఖితపూడిలో ఒకటి, కొప్పర్రులో ఒకటి, రుస్తుంబాదలో రెండు ఇళ్లు గాలివానకు దెబ్బతిన్నాయన్నారు. వీటిలో రెండు రేకుల షెడ్ల ఇళ్లు, మరో రెండు తాటి ఆకుల ఇళ్లు ఉన్నట్లు తెలిపారు. మొగల్తూరు, నరసాపురం మండలాల్లో మరో పది, పదిహేను రోజుల్లో పక్వానికి రానున్న సుమారు 600 ఎకరాల్లోని మామిడి కాయలు నేల రాలాయని తెలిపారు.


నరసాపురం రూరల్: కె.బేతపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిలకుమారి

కాపు సంఘ నేత గాది ఆంజనేయులు మృతి


ఆంజనేయులు (ఫైల్)

యలమంచిలి: యలమంచిలి మండల కాపు సంఘ ప్రధాన కార్యదర్శి గాది ఆంజనేయులు (55) ఆదివారం పాలకొల్లులో మరణించారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాపు సంఘ నేతగా సంఘ అభివృద్ధికి కృషి చేశారని ప్రముఖులు ఆయన సేవలను కొనియాడారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోకోనట్ మర్చంట్స్ అధ్యక్షుడిగా కఠారి

యలమంచిలి: ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పంట తరువాత అధిక పంట కొబ్బరి పంటే అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొబ్బరి పంట విశిష్టతను తెలిపారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కఠారి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో సంఘ సభ్యులు గెలిపించారని వారి నమ్మకాన్ని నిలబెట్టాలా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శిగా మాటూరి రామ్‌కుమార్, కోశాధికారిగా దేవరపు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా మాటూరి వీర వెంకట నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా చిటపు నాగేశ్వరరావు, కుందురు వెంకట్రామయ్య, లంకలపల్లి సత్య రమేష్, సహాయ కార్యదర్శిగా కొండేటి శ్రీనివాస్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహరావు, ఉపాధ్యక్షులు దేవరపు లక్ష్మీనారాయణ, గవర సూర్యనారాయణ, కొల్లి నరసింహమూర్తి, కొండేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కఠారి నాగేంద్ర కుమార్‌ను అభినందిస్తున్న సంఘ సభ్యులు

వాసవీమాతకు కుంకుమార్చనలు

పెనుగొండ: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు సందర్భంగా వాసవీ మాతకు కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరునికి అభిషేకాలు, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వాసవీ మాత, మహిషాసురమర్ధనీ అమ్మవార్లకు సుహసినీ పూజలు, కుంకుమార్చనలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పెనుగొండలో వాసవీ మాతకు కుంకుమార్చనలు

వాసవీ శాంతి ధాం నుంచి వాసవీ జ్యోతి యాత్ర

అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాం నుంచి తమిళనాడు భక్తులు ఆదివారం వాసవీ జ్యోతి యాత్ర ప్రారంభించారు. చెన్నైలో 300 సంవత్సరాల పురాతన శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి వేడుకల సందర్భంగా వాసవీ శాంతి ధాం నుంచి జ్యోతి యాత్ర చేస్తున్నారు. చెన్నై వాసవీ ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించి, జ్యోతిని తీసుకుని చెన్నైకు బయలుదేరి వెళ్లారు.


పెనుగొండ వాసవీ శాంతి ధాం నుంచి ప్రారంభమైన వాసవీ జ్యోతి యాత్ర

వైభవంగా తెప్పోత్సవం

నరసాపురం రూరల్: పట్టణంలో కోవెలగా సుపరిచితమైన శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పుష్కరిణిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంసవాహన తెప్పపై శ్రీ ఆదికేశవస్వామి, మణ్వాల మహాముని, రామానుజాచార్యుల ఉత్సవ విగ్రహాలను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ, జై రామానుజ అంటూ నినాదాలతో ఆ ప్రాంగణమంతా మారుమోగింది. ఉత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధనను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.


తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులను ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. టెంపుల్ సెంటర్ వద్ద రాత్రి ఏడు గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కె.శ్రీనివాసరావు(55) మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం వంకాయలపాలెం. ఆకు కూరలు అమ్ముతుంటాడని తెలిసింది. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


మల్లవరంలంకలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘ సభ్యులు

నరసాపురం రూరల్: జిల్లాలో అకస్మాత్తుగా వచ్చిన తీవ్రమైన గాలివానకు కల్లాల్లోని ధాన్యంతో పాటు కోత కోయని వరిపంట తీవ్రంగా దెబ్బతిందని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. ఆదివారం ఒక్క సారిగా వచ్చిన అకాల వర్షానికి జిల్లాలో ఎక్కడి ధాన్యం అక్కడే తడిసి పోయిందన్నారు. దీంతో పాటు తీవ్రమైన గాలికి వరిపంట నేలకొరిందన్నాను. పొలాల్లో నీరునిలిచి పోయే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం గోనె సంచులు ఇచ్చి తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.